ప్రజాశక్తి

బుధవారం 15 మే 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా



ఇబ్రహీంపట్నంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీలు వేయడాన్ని పరిశీలిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

తీర్పు భద్రం

ఇవిఎంలకు మూడంచెల భద్రత

నోవా, నిమ్రాల్లో 27 స్ట్రాంగ్ రూములు ఏర్పాటు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ, మచిలీపట్నం రూరల్ : పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఈవీఎంలు, ఇతర సామగ్రిని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. మూడంచెల భద్రత మధ్య భద్రంగా ఉంచారు. ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా, నిమ్రా కళాశాలల ప్రాంగణంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, సెగ్మెంట్లకు సంబంధించి 27 స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఇక్కడి స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలను ఉంచి, గదులకు సీల్ వేసే ప్రక్రియ... ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజూ రాజ్‌పాల్, అభ్యర్థుల మధ్య జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆధ్వర్యంలో జరిగింది. నోవా, నిమ్రా కళాశాలల మూడు క్యాంపస్‌ల్లో నాలుగు భవంతుల్లో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. క్లోజ్డ్ వాహనాలు, కట్టుదిట్టమైన భద్రత మధ్య రిసెప్షన్ కేంద్రాలు, ఇంటర్మీడియెట్ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను తీసుకొచ్చి శాశ్వత స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా సింగిల్ డోర్, విండోస్, వెంటిలేటర్లు, డబుల్ లాకింగ్ ఉండేలా ఏర్పాట్లు చేశారు. వాటర్ లీకేజీకి ఆస్కారం కూడా పటిష్ట ఏర్పాట్లు చేశారు. అలాగే అగ్ని ప్రమాదాలు గానీ, విద్యుదాఘాతాలు కానీ సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రెండు తాళాలకు సంబంధించి ఒకటి కలెక్టర్ ప్రతినిధి వద్ద, మరొకటి ఆర్‌వో

(మిగతా 2లో)

పెరుగుదల స్వల్పమే

✽కృష్ణాజిల్లాలో గతం కన్నా 0.9 శాతం అధికంగా పోలింగ్ ✽ఎన్‌టిఆర్ జిల్లాలో 0.14 శాతం

✽అర్ధరాత్రి వరకూ ఓట్లు వేసిన జనం ✽కృష్ణాలో పోలింగ్ శాతం 84.85 ✽ఎన్‌టిఆర్‌లో 79.36 శాతం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ పలు కేంద్రాల్లో రాత్రి 12 గంటల వరకు సాగింది. అర్ధరాత్రి వరకూ క్యూలైన్లలో వందల సంఖ్యలో జనం నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఓట్ల నమోదుకు సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడయ్యాయి. గత ఎన్నికలతో పోల్చుకుంటే కొంత అధికంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కృష్ణాజిల్లాలో మొత్తం 15 లక్షల 39 వేల 460 మంది ఓటర్లకుగాను 12 లక్షల 93 వేల 603 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 84.85గా నమోదైంది. 2019 ఎన్నికల్లో 84.36 శాతం ఓట్లు పోలయ్యాయి. దీంతో కేవలం 0.14 శాతం మాత్రమే ఈసారి అధికంగా పోలైనట్లు లెక్క. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో గత ఏడాదికన్నా ఈసారి 0.42 శాతమే ఓట్లు అధికంగా పోలయ్యాయి. జిల్లాలో మొత్తం 17 లక్షల 4 వేల 77 ఓట్లకుగాను 13 లక్షల 52 వేల 411 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 79.36గా ఉంది. 2019 ఎన్నికల్లో

(మిగతా 2లో)

ఎన్‌టిఆర్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం	2019లో	2014లో
1.తిరువూరు (ఎస్‌సి)	2,07,190	1,81,669	87.68	86.07	86.60
2.విజయవాడ పశ్చిమ	2,55,963	1,70,104	66.46	66.17	64.01
3.విజయవాడ సెంట్రల్	2,77,724	2,02,635	72.96	65.73	65.20
4.విజయవాడ తూర్పు	2,70,624	1,93,026	71.33	67.50	65.87
5.మైలవరం	2,81,732	2,40,487	85.36	89.60	85.29
6.నందిగామ (ఎస్‌సి)	2,05,480	1,79,915	87.56	88.01	84.96
7.జగ్గయ్యపేట	2,05,364	1,84,575	89.88	89.53	89.00
జిల్లా మొత్తం	17,04,077	13,52,411	79.36	78.94	77.28

కృష్ణాజిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

అసెంబ్లీ పేరు	మొత్తం ఓట్లు				మొత్తం పోలైన ఓట్లు				శాతం
	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	
1.గన్నవరం	1,34,226	1,44,816	12	2,79,054	1,14,503	1,22,34	23	2,36,848	84.88
2.గుడివాడ	0,97,710	1,06,550	11	2,04,271	81,119	87,408	10	1,68,537	82.51
3.పెడన	0,83,008	0,84,556	00	1,67,564	74,384	74,029	00	1,48,413	88.57
4.మచిలీపట్నం	0,94,788	1,01,881	11	1,96,680	78,103	83,001	05	1,61,109	81.91
5.అవనిగడ్డ	1,04,668	1,07,745	18	2,12,331	90,721	91,871	08	1,82,600	86.00
6.పామర్రు (ఎస్‌సి)	0,89,422	0,95,207	03	1,84,632	79,413	83,270	00	1,62,683	88.11
7.పెనమలూరు	1,42,349	1,52,577	02	2,94,928	1,13,443	1,19,969	01	2,33,413	79.14
జిల్లా మొత్తం	7,46,071	7,93,332	57	15,39,460	6,31,686	6,61,890	27	12,93,603	84.45

ప్లస్సా...మైనస్సా...



✽పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు

✽బూత్‌లవారీగా పరిస్థితిపై అంచనా

✽మరోవైపు ఫలితాలపై బెంగ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

పోలింగ్ ముగియడంతో ఇప్పుడు అభ్యర్థులు గెలుపోటములపై అంచనాలు కట్టుకుంటున్నారు. ఫలితాల కోసం జూన్ నాలుగో తేదీ వరకు వేచి చూడాలి. ఈ క్రమంలోనే పోలింగ్ ముగిసిన వెంటనే ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గెలుపోటములను బేరీజు వేసుకుంటున్నారు. ఏ పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓట్లు వస్తాయి, ప్రధాన ప్రత్యర్థి పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయి, ఇతర రాజకీయ పార్టీలు, స్వతంత్రులు ఎన్ని ఓట్లు చీల్చుతారు.. ప్లస్సా మైనస్సా ఇలాంటి లెక్కల్లో అభ్యర్థులు మునిగితేలుతున్నారు. మరోపక్క గెలుపు తమదేనని ఎవరికి వారు ధీమాతో ఉన్నారు.

మహిళల ఓట్లే అధికంగా పోల్

జిల్లాలో గత ఎన్నికల్లోనూ పోలింగ్ 84.36 శాతం నమోదైంది. మచిలీపట్నం పార్లమెంట్ స్థానంతోపాటు గన్నవరం మినహా ఆరు అసెంబ్లీ స్థానాల్లో వైసిపి విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో 84.45 శాతం నమోదైంది. పురుషుల

(మిగతా 2లో)

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి - విజయవాడ, కంచికచర్ల

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోయగా 3 గంటలు దాటిన తర్వాత ఆకాశం మబ్బులు పట్టింది. ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సుమారు గంటసేపు వర్షం పడింది. దీంతో అప్పటి వరకు ఉక్కపోతతో అల్లాడిన జనం ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. ఈదురు గాలులకు వీధుల వెంట చెత్తా చెదారం కొట్టుకు వచ్చింది. ఇదిలా ఉండగా మే రెండో వారంలోనే జల్లులు కురుస్తుండటంతో పొలాలను శుభ్రం చేయటానికి రైతులు సిద్ధమవుతున్నారు. వేసవిలోనే పొలాలు దుక్కులు దున్ని శుభ్రం చేస్తున్నారు.



మొదటిపేజీ తరువాయి



మచిలీపట్నంలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

తీర్పు 'భద్రం'

వద్ద ఉంటాయి. సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్), రాష్ట్ర పోలీసు బలగాలతోపాటు సీసీటీవీల నిఘా ఉంటుంది. సీసీటీవీల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను అభ్యర్థులు చూసుకోవచ్చు. ఇందుకు వారికి అనుమతి ఉంటుంది. వారికి పాస్‌లు కూడా మంజూరు చేశారు. ప్రతిరోజూ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లు కూడా సందర్శించి.. అంతా పరిశీలిస్తారు. రిటర్నింగ్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారు. రెండు, మూడు రోజుల్లో కౌంటింగ్‌కు కూడా ఏర్పాట్లు చేస్తారు. సీల్ వేసే ప్రక్రియలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఆర్‌వోలు బీహెచ్ భవానీ శంకర్, ఇ.కిరణ్మయి, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత భద్రత మధ్య ఇవిఎంలు

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఎన్నికల్లో ఓట్ల నమోదుకు ఉపయోగించిన ఈవిఎంలు, సామాగ్రిని పోలింగ్ ముగిసిన వెంటనే కట్టుదిట్టమైన భద్రత మధ్య తొలుత రిసెప్షన్ కేంద్రాలకు అధికార యంత్రాంగం తరలించింది. మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో పార్లమెంట్‌కు, అసెంబ్లీకి విడివిడిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో మంగళవారం భద్రపరిచారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,792 పోలింగ్ కేంద్రాల్లో 12,93,603 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో పార్లమెంట్‌కు, అసెంబ్లీకి ఓట్లు వేయడానికి వేర్వేరు ఈవిఎంలను ఉపయోగించారు. ఒక్కో ఓటరు పార్లమెంట్‌కు, అసెంబ్లీకి విడివిడిగా ఓట్లు వేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఈవిఎంలను సోమవారం రాత్రి యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు, పెనమలూరు, గన్నవరం, గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఈవిఎంలను ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లలో ఉంచారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పార్లమెంట్‌కు, అసెంబ్లీకి ఉపయోగించిన ఈవిఎంలను యూనివర్శిటీలో విడివిడిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా చర్యలు ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్), రాష్ట్ర పోలీస్ బలగాలతో పాటు సీసీటివిల నిఘా ఏర్పాటు చేశారు. సీసీటివిల చిత్రాలను డిస్ప్లే ఏర్పాటు చేసి అభ్యర్థులు తిలకించే విధంగా ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

పెరుగుదల స్వల్పమే

78.94 శాతం పోలింగ్ నమోదైంది. అంటే పెరుగుదల కేవలం 0.14 శాతం మాత్రమే. కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గంలో అత్యధికంగా ఓట్లు నమోదుకాగా, పెనమలూరు నియోజకవర్గంలో అత్యల్పంగా ఓట్లు పోలయ్యాయి. పెడనలో అత్యధికంగా లక్షా 67 వేల 564 ఓట్లకుగాను లక్షా 48 వేల 413 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఆ నియోజకవర్గంలో 88.57 శాతం ఓట్లు నమోదయ్యాయి. పెనమలూరు అత్యల్పంగా 2,94,928 ఓట్లకుగాను 2,33,413 ఓట్లు పోలయ్యాయి. 79.14 శాతం ఓట్లు నమోదయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో అత్యధికంగా జగ్గయ్యపేట నియోజకవ్గంలో ఓట్లు పోలయ్యాయి. అక్కడ 2 లక్షల 5 వేల 364 ఓట్లకుగాను లక్షా 84 వేల 575 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 89.88గా ఉంది. అలాగే జిల్లాలో అత్యల్పంగా విజయవాడ పశ్చిమలో నమోదైంది. ఇక్కడ 2 లక్షల 55 వేల 963 ఓట్లకుగాను లక్షా 70 వేల 104 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల శాతం 66.46గా నమోదైంది.

పోలైన ఓట్లలో మహిళలవే అధికం

కృష్ణాజిల్లాలో మహిళల ఓట్లే అత్యధికంగా పోలయ్యాయి. జిల్లాలో మొత్తం పురుషుల ఓట్లు 7,46,071, మహిళల ఓట్లు 7,93,332, ఓట్లు థర్డ్ జండర్ 57 ఉన్నాయి. అయితే పురుషుల ఓట్లు 6,31,686, మహిళల ఓట్లు 6,61,890, ఇతరుల ఓట్లు 27 పోలయ్యాయి. పురుషులకన్నా 30,204 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు.

సెంట్రల్లో భారీగా ఓట్లు నమోదు

గతం కన్నా 7.23 శాతం పెరుగుదల

ప్రజాశక్తి - విజయవాడ : ఓటరు నాడిని అంచనా వేయలేక అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎవరి అంచనాల్లో వారు తలమునకలై ఉన్నారు. పార్టీల వారీగా వచ్చే ఓటెన్ని అనేదిశగా కూడికలు, తీసివేతల్లో ఆయా పార్టీల అభ్యర్థులు నిమగ్నమయ్యారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఈసారి అధికంగా ఓట్లు పోలయ్యాయి. 2 లక్షల 77 వేల 724 ఓట్లకుగాను 2 లక్షల 2 వేల 635 ఓట్లు పోలయ్యాయి. 72.96 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో ఎన్నికల్లో ఇక్కడ ఎన్నికల్లో 65.73 శాతం ఓట్లు, 2014 ఎన్నికల్లో 65.20 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే ఈసారి 7.23 శాతం అధికంగా ఓట్లు పోలైనట్లు స్పష్టమవుతోంది. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. లక్షా 42 వేల 845 మంది మహిళా ఓటర్లు, లక్షా 34 వేల 829 మంది పురుష ఓటర్లు, 50 ఇతర ఓటర్లు ఉన్నారు. లక్షా 3 వేల 380 మంది మహిళా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనగా, 99,214 మంది పురుష ఓటర్లు ఓటు వేశారు. 41 మంది ఇతర ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం వ్యాప్తంగా 21 డివిజన్లలో ఏర్పాటు చేసిన 267 పోలింగ్ బూత్‌ల్లో బూత్‌ల వారీగా పోలైన స్త్రీ, పురుష ఓట్లను అభ్యర్థులు లెకించుకుంటున్నారు. ఏఏ తరగతుల వారు ఏఏ పార్టీకి ఓటు వేసి ఉంటారనే ఆలోచనలో ఆయా పార్టీల నేతలు కూడికలు, తీసివేతలు వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో వైసిపి, టిడిపి అభ్యర్థులు ఓట్లు కోసం కోట్లు కుమ్మరించారు. ఓటర్లకు వైసిపి, టిడిపి నేతలు డబ్బులు ఎరవేసిన నేపథ్యంలో ఖచ్చితమైన అంచనాకు ఏ ఒక్క పార్టీ అభ్యర్థీ రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే గెలుపోటములపై ఆయా పార్టీల అనుయాయులు భారీగానే బెట్టింగులు కాస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా ఓటరు నాడి అర్థంకాక అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

సుందరయ్య వర్ధంతి సందర్భంగా

20న 'దేశ సమైక్యత - ఎదురవుతున్న సవాళ్లు'పై స్మారకోపన్యాసం

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ : స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భాతర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు "దేశ సమైక్యత - ఎదురవుతున్న సవాళ్లు" అంశంపై స్మారకోపన్యాసం జరుగుతుంది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి పిచ్చయ్య ఎసి ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షత వహిస్తారు. 'దేశ సమైక్యత' అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు స్మారకోపన్యాసం చేస్తారు. ఈ మేరకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఎవరి ధీమా వారిదే...!

- గెలుపు పై నాయకులు చర్చలు

- గ్రామాల వారీగా అంచనాలు వేస్తున్న నేతలు

ప్రజాశక్తి - మైలవరం : నెల రోజులుగా ప్రచారంలో అలసిన నేతలకు మంగళవారం నుండి విరామం దొరికింది. ఫలితాల వెల్లడికి మరో 20 రోజులు ఉండటంతో పోలింగ్ సరళిపై ఆయా పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. గ్రామాలవారీగా పోలింగ్‌ను పరిశీలిస్తూ కూడికలు తీసివేతల్లో నాయకులు మునిగిపోయారు. ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 83.47 శాతం పోలింగ్ నమోదవుగా, ప్రస్తుతం 85.36 శాతం పోలింగ్ నమోదైంది. అప్పటికంటే ప్రస్తుతం 2 శాతం పోలింగ్ పెరిగింది. 1500 మంది ఓటర్లుపెరిగారు. ఎన్నడూ లేనివిధంగా మహిళలు, వద్దులు, యువకులు పోటీలు పటి క్యూలో నిల్చొని ఓట్లు వేయడంతో గెలుపు ఎవరిని వరిస్తుందో చెప్పలేమని చెబుతున్నారు.

వైసిపి, టిడిపి మధ్య పోటీ

మైలవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వైసిపి, టిడిపి అభ్యర్థులు సర్నాల తిరుపతిరావు, వసంత కష్ణప్రసాద్ మధ్య పోటీ నెలకొంది. వసంత గెలుపు నల్లేరుపై నడకే అనుకున్నారు. కానీ నామినేషన్ల అనంతరం నువ్వా నేనా అన్నట్లుగా రేపిన ఉత్కంఠ పోలింగ్ అనంతరం అలాగే కొనసాగుతోంది. నగర, గ్రామీణ వాతావరణం కలగలిపి ఉన్న నియోజకవర్గంలో ఈసారి అనేక అంశాలు ఎన్నికలపై ప్రభావం చూపాయనే వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 2,81,841 మంది ఓటర్లున్నారు. అందులో 2,71,712 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 8,232 మంది మహిళలు పురుషుల కంటే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కీలకమైన ప్రాంతాల్లో...

నియోజకవర్గ చివరిన ఉన్న గొల్లపూడి, జక్కంపూడి కాలనీతోపాటు ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లో ఉన్న ఓట్లే అభ్యర్థుల గెలుపోటములు ఆధారపడి ఉంటాయని భావిస్తున్నారు. పోలింగ్ అనంతరం కూడా అక్కడ జరిగిన పోలింగ్ శాతాన్ని ప్రామాణికంగా తీసుకొని లెక్కలు వేస్తున్నట్లు వైసిపి, టిడిపి నాయకులు చెబుతున్నారు. కీలకంగా ఉన్న గొల్లపూడిలో అత్యధిక శాతం ఓట్లు తమవేనని, ఆ మెజారిటీతో సునాయాసంగా గెలుస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు చెబుతున్నారు. కొండపల్లి ప్రాంతంలో ఉద్యోగులు ఎక్కువ శాతం టిడిపికే ఓట్లు వేశారని, అదికూడా తమకు కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో టిడిపికి కంచుకోటగా ఉన్న రెడ్డిగూడెం మండలం గత ఎన్నికల్లో వైసిపి ఆధిక్యత సాధించింది. మళ్లీ రెడ్డిగూడెంలో టిడిపికి తిరుగులేని మెజార్టీ తీసుకొస్తామని నాయకులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో జనసేన విడిగా పోటీ చేయటంతో కొన్ని ఓట్లు పడ్డాయని, ఇప్పుడు జనసేన, బిజెపి కలిసి రావడంతో గెలుపు సునాయాసం అని ఆ పార్టీ నేతలు లెక్కలు వేస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో టిడిపికి కంచుకోటగా ఉన్న గొల్లపూడిలో మెజార్టీ తగ్గిస్తామని వైసిపి నాయకులు చెప్తున్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన మహిళలు, వద్ధులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు వైసిపికే ఓట్లు వేశారని, దీంతో తమ విజయం సునాయాసమేనని వైసిపి నేతలు పేర్కొంటున్నారు. అలాగే జక్కంపూడి కాలనీలో కూడా తమకే ఆధిక్యత వస్తుందని అంటున్నారు. మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, జక్కంపూడి కాలనీల్లో తిరుగులేని మెజార్టీని సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతం కంటే 2 శాతం పోలింగ్ పెరగడంతో ఎవరికి వారే గెలుపు పైధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులు గెలుపు అవకాశాల గురించి చర్చించుకుంటున్నారు.

ప్లస్సా... మైనస్సా...

(మొదటి పేజీ తరువాయి)

ఓట్లకంటే జిల్లాలో మహిళల ఓట్లే అధికంగా పోలయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అత్యధిక సంఖ్యలో అందుకున్న మహిళల ఓట్లు అధికంగా పోలవ్వడం తమకు కలిసి వస్తుందని అధికార పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే పెద్ద సంఖ్యలో ప్రజలు ఓటింగ్‌కు తరలి వచ్చి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశారని, ఇది తమకు మేలు చేస్తుందని టిడిపి, జనసేన నేతలు విశ్లేషిస్తున్నారు. గత ఎన్నికల్లోలా ఫలితాలు వన్‌సైడ్ ఉంటాయా? లేక పోటాపోటీగా ఉంటాయా అన్నది రాజకీయ విశ్లేషకులకు అంతుచిక్కడం లేదు. ఈ ఫలితాల కోసం మరో 18 రోజులు ఎదురు చూడక తప్పని పరిస్థితి ఉంది.

ఓటర్లకు సిపిఎం, వైసిపి, టిడిపి ధన్యవాదాలు

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గంలో సిపిఎం విజయాన్ని కాంక్షిస్తూ అహర్నిశలూ కృషి చేసిన సిపిఎం, ఇండియా వేదిక పార్టీల (కాంగ్రెస్, సిపిఐ, ఆమ్‌ఆద్మీ, ఆర్‌జెడి) నాయకులు, కార్యకర్తలకు పార్టీ అభ్యర్థి చిగురుపాటి బాబూరావు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ విజయాన్ని కాంక్షిస్తూ అనేక విధాలుగా మద్దతు తెలిపిన అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఏ వెలంపల్లి శ్రీనివాసరావు, టిడిపి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు కూడా వేర్వేరు ప్రకటనల్లో తమకు మద్దతు తెలిపిన పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోలింగ్‌కు సహకరించిన అధికారులకు, ఓటర్లకు విజయవాడ నగర పాకల సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ధన్యవాదాలు తెలిపారు.

అత్యధికంగా 99.57 శాతం పోలింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ బూత్ నంబర్ 76ఏలో అత్యధిక సంఖ్యలో ఓట్లు పోలయ్యాయి. ఈ బూత్‌లో 700 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ఏకంగా 697 మంది ఓట్లు వేశారు. పోలింగ్ శాతం 99.57గా నమోదైంది. అత్యల్పంగా 76వ నంబర్ బూత్‌లో 888 ఓట్లుండగా 520 మంది అంటే 58.56 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి.

ట్రాఫిక్ దిగ్బంధనంలో గన్నవరం



ప్రజాశక్తి- గన్నవరం : ఆర్టీసి బస్టాప్లో ఆటోలు.. రోడ్డు మధ్యలో బస్సులు.. ఇదీ గన్నవరం పట్టణంలోని బస్టాప్ల పరిస్థితి. గన్నవరం-బుద్దవరం రోడ్డు ఆరంభంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్టీసి బస్టాప్ ఉంది. రోజూ వందలాది మంది ప్రయాణికులు బస్సులు ఎక్కడానికి అక్కడికి వస్తుంటారు. బస్టాప్ ఖాళీగా ఉంటే పాయింట్లో బస్సులు కాసేపు నిలవడానికి వీలుంటుంది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఎక్కుతారు. అయితే కొద్ది రోజులుగా టాటా మ్యాజిక్ ఆటో నిర్వాహకులు ఆటోలు బస్టాప్ ఎదుటే నిలుపుతున్నారు. ప్రయాణికులు రోడ్డు మధ్యలో నిలబడాల్సి వ స్తుంది. ఆటో ప్రయాణికులతో నిడి వెళితే వేరొక ఆటో తీసుకొచ్చి పెడుతున్నారు. చైన్ లింక్ విధానంలో వీటిని పెట్టి ప్రయాణికులు నిలువడానికి వీల్లేని దుస్థితిని కల్పిస్తున్నట్లు అందరూ చెబుతున్నారు. బస్టాండ్ నుండి విజయవాడ వైపుకువెళ్లే ఆర్టీసి బస్సులు బస్టాప్ వద్ద ఆగాలి. అయితే ఆటోల వల్ల నడిరోడ్డుపై ఆపుతున్నారు. దీంతో రహదారిపై వాహనాలు పెద్ద సంఖ్య లో నిలిచిపోతున్నాయి. ప్రయాణికులు నానా అగచాట్లకు గురవుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆటోలు తీయ్యమని ఎవరైనా అడిగితే ఆటో వాలాలు దాడికి తెగబడుతున్నారని చెబుతున్నారు. రోజూ వారికి చెప్పినా వినిపించుకోని పరిస్థితుల్లో ప్రయాణికులు చెప్పడం వదిలేశారు. రో డ్డు మధ్యలో ఆగిన బస్సులు ఎక్కడానికి పరుగులు పెడుతున్నారు. ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకుని ఇష్టానుసారంగా నిబంధనలు అతిక్రమించిబస్టాప్ను ఆక్రమిస్తున్నారని విద్యావంతులు విమర్శి స్తున్నారు. కనీసం ట్రాఫిక్ పోలీసులు కూడా ఇక్కడ విధుల్లో ఉండటం లేదని తెలిపారు. దీని కి తోడు బస్టాప్ పక్కనే హెూటల్ పెట్టి ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే నిలిపేయడంతో ట్రాఫిక్ ఆగిపోతుంది. ఈ సమస్య పరిష్కారానికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థా నికులు విమర్శిస్తున్నారు.

పోలీసులు ఉన్నా ఉపయోగం లేదు

గన్నవరంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఉన్నా ట్రాఫిక్ సమస్యలు తగ్గడం లేదని స్థానిక ప్రజలు అంటున్నారు. గాంధీబొమ్మ సెంటర్లో ఉదయం, సాయంత్రం రోడ్డు దాటాలంటే చాలా కష్టంగా మారుతోంది. వద్ధులు, పిల్లలు చాలా సేపు నిలబడి తర్వాత దాటుతున్నారు. లేదంటే స్పీడ్గా వాహనాలు వచ్చి ఢీకొట్టే పరిస్థితి కనిపిస్తుంది. ట్రాఫికో పోలీసులు డ్యూటీలో ఉన్నా వాహనాలు ఆగడం లేదు. ఎందుకంటే వారు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. బుద్దవరం బస్టాప్ను ఆటోలు ఆక్రమించిన విషయం పోలీసుల దష్టికి వెళ్లినా స్పందించడం లేదని జనాలు చెబుతున్నారు. ప్రయాణికులకు నరకం చూపిస్తున్న వారిని నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పమిడిముక్కల : బస్సు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పమిడిముక్కల మండలంలోని మేడూరులో జరిగింది. వివరాల ప్రకారం మేడూరుకు చెందిన గొరికిపూడి నాగభూషణం (51)ను బస్సు ఢీకొనడంతో మృతిచెందారు. దీనికి కారణం అయిన వారిని అదుపులోకి తీసుకోవాలని, కేసు పెట్టాలని మేడూరు గ్రామవాసులు పోలీస్ స్టేషన్లో ముట్టడించి ధర్నా చేశారు.బాదిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని ఎస్ఐ శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వడ్ల పురి దగ్ధం



ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో బాణ సంచా రవ్వలు పడి వడ్ల పు రి దగ్ధమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన రేపల్లె వెంకట కష్ణారావు అనారోగ్యంతో మతి చెందగా ఆయన అంత్యక్రియల కోసం బాణసంచా పేల్చారు. అది బుద్ధినేని చంద్రశేఖర్ కు చెందిన వడ్ల పు రి మీద పడటంతో ఒకసారిగా మంటలు అంటుకున్నాయి. దీనితో ఫైర్ స్టేషన్కు సమాచారం అందించగా హుటాహుటిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీనితో రూ 50 వేల రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చునని ఫైర్ సిబ్బంది తెలిపారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ఉపాధి కార్మికుడి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన ఉపాధి కార్మికుడు మృతిచెందడంతో ఆ కుటుంబా నికి ఉపాధి కూలీలు, మేట్ వాకసముద్రాలతో కలిసి రూ 13 వేల రూపాయల నగదు, 40 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. మరణించిన వ్యక్తికి సంబంధించిన మూడోరోజు చిన్న కర్మ కోసం వీరరాఘవయ్య మాస్టారు సముద్రాలు ఉపాధి కూలీలతో కలిపి ఈ సాయం చేసినట్లు తెలిపారు.

కూటమిదే విజయం : బాలశౌరి


ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : ఎన్నికల్లో కూటమి పార్టీ అధికారంలోకి వస్తుందని మచిలీపట్నం నియోజక వర్గ కూటమి అభ్యర్థులు కొల్లు రవీంద్ర, వల్లభ నేని బాల శౌరి,లు తెలిపారు.మంగళవారం స్థానిక నియోజక వర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం చరిత్రలో ఎప్పుడు జరగని విధంగా ఈ సారి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం శుభపరిణామం అన్నారు. మచిలీపట్నంలో అధికార పార్టీ నాయకులు ఓడిపోతున్నమనే తెలిసి అనేక చోట్ల అరాచకాలకు దిగారన్నారు. వారి అరాచకాలను కూటమి నాయకులు కార్యకర్తలు తిప్పికొట్టరన్నారు. జిల్లాలో 7 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాదించబోతున్నారాన్నారు. తమకు సహకరించిన మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావుకు బ జగన్నాథరావు, బండి రామకష్ణకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు. ఈ సమావేశంలో కొనకళ్ల జగన్నాథరావు, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ బండి రామకష్ణ, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ఎంవీ బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంల తరలింపు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : జిల్లా ప్రజానీకం, రాజకీయ పక్షాల సహకారంతో జిల్లాలో పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని, మూడంచెల కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు, సంబంధిత సామగ్రిని స్ట్రాంగ్ రూమ్ల్లో భద్రపరచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కష్ణ విశ్వవిద్యాలయంలో గన్నవరం, గుడివాడ, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు, పెనమలూరు 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి పార్లమెంటు, అసెంబ్లీలకు వేరువేరుగా ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ల్లో ఈవీఎంలను ఉంచి, మచిలీపట్నం పార్లమెంటు, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ శాసనసభ స్థానాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులు జాన్ కింగ్స్ లే, గన్నవరం గుడివాడ పామర్రు పెనమలూరు శాసనసభ స్థానాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులు నరహరి సింగ్ బంగర్, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వారి ప్రతినిధుల సమక్షంలో బందరు పార్లమెంటు రిటర్నింగ్ అధికారి,జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏడు అసెంబ్లీల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం స్ట్రాంగ్ రూములకు సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ సోమవారం జిల్లాలో పోలింగ్ ముగిసిన వెంటనే మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను రాత్రికి రాత్రి కష్ణ విశ్వవిద్యాలయంలో రిసెప్షన్ కేంద్రాలకు తరలించినట్లు, గన్నవరం, గుడివాడ, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు తరలించి, అక్కడి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి, మంగళవారం వాటిని కట్టుదిట్టమైన భద్రత నడుమ కష్ణ విశ్వవిద్యాలయంకు తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా నియోజక వర్గాల నుండి ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య రిసెప్షన్ కేంద్రాలకు తరలించడం, స్ట్రాంగ్ రూమ్ల్లో భద్రపరచడం జగిందన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్), రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు సీసీటీవీల నిఘా ఏర్పాటు చేసినట్లు, సీసీటీవీల చిత్రాలను డిస్ప్లే ఏర్పాటు చేసి అభ్యర్థులు వీక్షించే విధంగా ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు.జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె చంద్రశేఖర రావు, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు వారి ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.



స్ట్రాంగ్ రూంకు తాళాలు వేస్తున్న దృశ్యం

గుడివాడలో 82.51 శాతం ఓటింగ్

ప్రజాశక్తి - గుడివాడ : సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2 లక్షల,4 వేల 27 మంది ఉండగా, వారిలో లక్ష 68వేల,537మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.అందులో 81వేల119 పురుషులు ఓటు హక్కు వినియోగించుకోగా, 87వేల408 మంది మహిళలు, పదిమంది ట్రాన్స్ జెండర్స్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం గుడివాడ నియోజకవర్గంలో 82.51 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు.

గన్నవరంలో 84.88 శాతం ఓటింగ్

ప్రజాశక్తి - గన్నవరం : సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,79,054 మంది ఉండగా, ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు 2, 36,848 మంది ఉన్నారు. అందులో 1,14,503 పురుషులు ఓటు హక్కు వినియోగించుకోగా, 1,22,342 మంది మహిళలు, 5 మంది ట్రాన్స్ జెండర్స్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం నియోజకవర్గంలో 84.88 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. ఈవీఎంలను మార్కెట్ యార్డులో భద్రపరిచినట్లు చెప్పారు.

అవనిగడ్డలో 86 శాతం పోలింగ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల పోలింగ్లో 86 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. మొత్తం నియోజకవర్గంలో 2 లక్షల 12 వేల 331 మంది ఓ టర్లు ఉండగా ఇందులో 90,721 పురుష ఓటర్లు 91 వేల 871 మహిళా ఓటర్లు ఇతరులు 8 మంది ఓట్లు పోలయ్యాయన్నారు. మొత్తం 1,82,600 ఓట్లు పోలైనట్లు చెప్పారు. దీంతో 86 శాతం పోలింగ్ నమోదయిందని, మండలాల వారీగా ఇంకా వివరాలు తెలియవలసి ఉందని ఆరో బాలసుబ్రమణ్యం చెప్పారు.



ఫలితాలపై నేతల్లో టెన్షన్

ప్రజాశక్తి-కంచికచర్ల

సోమవారం జరిగిన ఎన్నికల్లో నందిగామ నియోజకవర్గంలో గతంలోఎన్నడూలేని విధంగా పోలింగ్ శాతం పెరగడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు వారి అనుచరుల్లో టెన్షన్ మొదలైంది. నియోజకవర్గంలో మొత్తం 2,05,480 మంది ఓటర్లకు రాత్రి తొమ్మిది గంటల వరకు 1,79,915 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 87.50 శాతం పోలింగ్ జరిగింది. నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి అధికార వైసిపి, కూటమి మధ్య ప్రతి విషయంలోనూ తీవ్ర పోటీ నెలకొంది. ప్రచారం, నామినేషన్లు, ప్రచారం, నగదు పంపిణీ, మద్యం పంపిణీ వంటి విషయాల్లో పోటాపోటీగా చేశారు. చివరకు ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకురావడంలోను తీవ్రంగా శ్రమించారు. నగదు పంపిణీ విషయంలోనూ రెండు పార్టీలు పోటీపడ్డాయి. పెరిగిన ఓటింగ్ శాతం, ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తితో ఫలితాలు తమకు అనుకూలంగా వస్తాయని కూటమి భావిస్తుంది. మంగళవారం పోలింగ్ బూత్‌లలో ఏజెంట్లుగా ఉన్న వారితో ఏ బూత్‌లలో ఎంత పోలింగ్ జరిగింది, ఇందులో తమకు అనుకూలంగా ఉన్న ఓట్లు ఎన్ని అని ఆరా తీస్తున్నారు.

జగ్గయ్యపేటలో 89.89 శాతం పోలింగ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట నియోజకవర్గంలో 89.89 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2.09 లక్షల మంది ఉండగా 1.80 లక్షల ఓట్లు పోలయ్యాయని తెలిపారు. జగ్గయ్యపేట పట్టణం, మండలం, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలతో పాటు నందిగామ మండలంలోని పది ఏటుపట్టు గ్రామాల్లోని 222 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఓటర్లు రాత్రి 11 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.

మైలవరంలో తగ్గిన పోలింగ్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

మైలవరం నియోజకవర్గంలో 85.36 శాతం 2019 సాధారణ ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్ శాతం తగ్గింది. 2019లో మొత్తం 2,80,536 ఓట్లు ఉంటే 2,32,500 ఓట్లు పోల్ అవ్వగా 89.6 శాతం నమోదయింది. వైసీపీ తరుపున పోటి చేసిన వసంత కృష్ణప్రసాద్‌కు 1,14,940 ఓట్లు రాగ, టీడీపీ అభ్యర్థి దేవినేని ఉమాకు 1,02,287 ఓట్లు పోల్ కాగా, జనసేన నుంచి పోటీ చేసిన అక్కల రామమోహన్ రావు 8, 716 ఓట్లు పొందారు. ఆ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన వసంత కష్ణ ప్రసాద్ 12, 747 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2024 ఎన్నికల్లో 2, 81, 732 ఓట్లు ఉండగా 2, 40, 487 ఓట్లు పోల్ అవ్వగా 85. 36 శాతం నమోదయింది. 2009లో 2,34,025 ఓట్లకు గానూ 2,01,155 పోల్ అవ్వగా 85. 96 శాతంగా ఉంది. ఆ ఎన్నికల్లో జోగి రమేష్ పై దేవినేని ఉమా 7, 569 ఓట్ల మెజార్టీ గెలిచారు.

తిరువూరులో స్వల్పంగా పెరిగిన ఓటింగ్

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 87.68 శాతం ఓట్లు పోలాయ్యాయి. మొత్తం రెండు లక్షల ఏడు వేల190 ఓటర్లకు గాను లక్షా ఎనిమిది వేల 669 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజలు గంటల తరబడి కొన్ని చోట్ల రాత్రి 12 గంటల వరకు క్యూలో నిలబడి ఓటు హక్కును ఉపయోగించుకోవటం వారి చైతన్యానికి నిదర్శనం. అయితే 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల పోలింగ్ శాతం పెద్దగా ఏమి పెరగలేదు. 2019 మొత్తం రెండు లక్షల మూడువేల 436 ఓట్లకు గాను లక్షా 75 వేల 682 (86.36 శాతం) ఓట్లు పోలయ్యాయి. 2019 పోలైన 86.36 శాతం, ఇప్పుడు 87.68 శాతం ఓట్లు పోలయ్యాయి. కొత్తగా నియోజకవర్గంలో ఓటుహక్కు పొందినవారు గత ఎన్నికల తర్వాత ఐదు వేల మంది ఉన్నారు. తొలగింపులు పోను నాలుగు వేల ఓట్లు మాత్రమే కొత్తగా చేరాయి. తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి ఒక రాజకీయ పార్టీ పోల్ మేనేజ్మెంట్ పేరుతో చేసిన హడా వుడి ప్రత్యర్థుల్ని చెమటలు పట్టించింది. విదేశాల నుండి, ఇతర



ప్రాంతాల నుండి అధిక వ్యయ ప్రయాసల కోర్చి తమకు అనుకూలంగా ఉండే ఓటర్లను రప్పించి ఓటింగ్ శాతం పెరిగిపోతోందని, ఇది తమ గెలుపుకు సంకేతాలని ఊదరగొట్టినప్పటికీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. గత ఎన్నికలకు, ఈ ఎన్ని కలకు పరిశీలిస్తే ఇతర ప్రాంతాల నుండి ప్రత్యేక వాహ నాల్లో వచ్చిన ఓటర్లు ఏమయ్యారు? వారి ప్రభావం ఏమిటి? ఓటింగ్ శాతం గత ఎన్నికలంటే ఈ ఎన్నికలో ఎందుకు పెరగలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.



న్యాయవాదులకు శిక్షణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండల న్యాయ సేవాధికారి సంస్థ తరుపున న్యాయవాదులకు మధ్యావర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం మంగళవారం కోర్టులో జరిగింది. ఈ కార్యక్రమంలో మన పరిధిలో ఉన్న కేసుల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వంగా వ్యవహరించటానికి న్యాయవాదులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి శ్రావణి, నేషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి శోభారాణి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాక సుందరరావు, డి వెంకటరమయ్య, పీ. సత్య శ్రీనివాసరావు, ఎస్ నరసింహారెడ్డి, జె శ్రీనివాసరావు, టి. ఎల్. నరసింహారావు, ఆంజనేయులు, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో 87.55 శాతం పోలింగ్

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 87.55 శాతం పోలింగ్ నమ్మెదైంది. నియోజకవర్గం లో 2,05,480 మంది ఓట్లు వుండగా, 1,79,915 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో 69 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ప్రస్తుతం భారీగా 87.55 శాతం పోలింగ్ అవటంతో నందిగామ నియోజకవర్గం లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేకత వల్ల పోలింగ్ శాతం పెరిగిందని టిడిపి వారు ప్రచారం చేస్తున్నారు. ఎన్ఆర్ఐలు, ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా హైదరాబాద్, చైన్నెయి, బెంగళూరు నగరాలలో నివాసం వుండే నందిగామ నియోజకవర్గం స్థానికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియ్యోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గం లో గతంలో ఎన్నడూ జరగని విధంగా జరిగిన అభివద్ధి వల్ల ప్రజలు పెద్దసంఖ్యలో ఓట్లు వేశారని వైసీపీ వారు ప్రచారం చేసుకుంటున్నారు.

ఎన్నికల పరిశీలకులకు స్ట్రాంగ్ రూమ్‌లపై అవగాహన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గంలో ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి. నియోజవర్గం మొత్తం ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి ఓటు కల్పించామని కొంతమంది తమ ప్రతినిధులు విచారణ కొరకు ఇళ్ల వద్దకు వెళ్లిన సందర్భంలో ఇంటి వద్దలేని వారికి మాత్రమే కొన్ని ఓట్లు తొలగించడం జరిగిందన్నారు వాటిలో కూడా ఫిర్యాదులు చాలా తక్కువగా వచ్చాయని అన్నారు.ఎన్నికల అనంతరం ఈవీఎంలలో స్ట్రాంగ్ రూములలో అధికారులు భద్రపరిచారు. సుమారు 85 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి 11 గంటల వరకు చివరిగా ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరు మండలం వెలగలేరులో పోలింగ్ చివరగా ముగిసినట్లు స్పష్టం చేశారు. ఓటర్లు ఇబ్బంది పడకుండా



ఉండేందుకు అన్ని పోలింగ్ కేంద్రాలలో మంచినీటి వసతి తో పాటు ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ఎంతో ఆసక్తిగా ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో తరలిరావడం హర్షణీయమన్నారు. మైలవరం నియోజకవర్గంలో మొత్తం 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. మైలవరం, విజయవాడ తూర్పు, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఈవీఎంలను ఇబ్రహీంపట్నంలోని నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచగా, విజయవాడ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల ఈవీఎంలను నోవా ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. మంగళవారం అభ్యర్థులకు ఎన్నికల పరిశీలకులకు స్ట్రాంగ్ రూమ్ ల గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. స్ట్రాంగ్ రూములకు 24 గంటల పాటు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ప్రత్యేక భద్రత బలగాలు పహారా నిర్వహిస్తాయని తెలిపారు. అభ్యర్థులకు ఎప్పుడు ఎటువంటి అనుమానం వచ్చిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ కు వచ్చి రిజిస్టర్ లు సంతకం చేసి సీసీ కెమెరాలు వీడియోలను పరిశీలించుకోవచ్చునని తెలిపారు.

విద్యార్థిపై కర్రలతో దాడి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కళాశాల విద్యార్థిపై కర్రలు, బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది.పట్టణంలోని మిట్టగూడెంకు చెందిన ఒంటిపులి సోమేశ్వరరావు పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సోమేశ్వరరావు తన స్నేహితుడు నరసింహారావుతో కలిసి బైక్‌పై చిల్లకల్లు వెళ్లి తిరిగి జగ్గయ్యపేట వస్తుండగా ఎస్‌జీఎస్ కళాశాల సమీపంలో సుమారు 25 నుండి 30 మంది గుర్తు తెలియని వ్యక్తులు సోమేశ్వరరావుపై బీరు సీసాలు, కర్రలతో దాడి చేసి తల పగలగొట్టారు. దీంతో తీవ్ర రక్తస్రావం అయింది. దాడికి భయపడిన సోమేశ్వరరావు రోడ్డు పక్కన గల షేక్ హసీనా ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో గల హసీనా విద్యార్థిపై దాడి చేస్తున్న వ్యక్తులను కొట్టవద్దంటూ అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన వ్యక్తులు హసీనాను సైతం తల, చేతిపై కర్రలతో కొట్టి మెడలో గల బంగారం చైన్ లాక్కొని, ఇంట్లో సామాన్లను సైతం ధ్వంసం చేశారు. సోమేశ్వరరావు స్నేహితుడు నరసింహారావును సైతం గాయపరిచారు. గాయపడ్డ హసీనా, సోమేశ్వరావులను జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కొరకు సోమేశ్వరరావును ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట ఎస్సై భగవాన్ హాస్పిటల్‌కు వచ్చి సోమేశ్వరరావును వివరాలను అడిగి తెలుసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





బాధిత మహిళకు సిపిఎం పరామర్శ

విద్యార్థిపై జరిగిన దాడితో సంబంధం లేని మహిళ హసీనాపై దాడి చేయడం, మెడలో గల బంగారు చైను లాక్కుని వెళ్లడం దారుణమని సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి అన్నారు. పట్టణంలో హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న హసీనాను సిపిఎం నాయకులు కోట కృష్ణ, షేక్ గౌస్‌మియా, న్యాయవాది దాసరి నాగేశ్వరరావు, వివి రాంప్రసాద్, రావెళ్ల శేషు పరామర్శించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై భగవాన్‌ను కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ వ్యతిరేకత వల్లే ఓటింగ్ పెరిగింది

విజయవాడ పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నుండి ఎన్‌డిఏ కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాను అత్యధిక మెజారిటీతో గెలుస్తున్నామని పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కంటే నాలుగు నుండి ఐదు శాతం వరకు ఓటింగ్ పెరిగిందని, పెరిగిన ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ అని ఆయన వివరించారు. మంగళవారం పశ్చిమ బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రజలు ప్రభుత్వం పట్ల వ్యతిరేకతతో ఉండడం వలనే ఓటింగ్ శాతం పెరిగిందని అన్నారు. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ అని, పశ్చిమలో ప్రజలు చైతన్యవంతం చేసేందుకు చేసిన ప్రయత్నం సఫలం అయిందన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని తెలిపారు. కమలం గుర్తుకు, సైకిల్ గుర్తుకు ఓటు వేశారని భావిస్తున్నామన్నారు. నాలుగవ తేదీ ఫలితాలు అనంతరం పశ్చిమ ప్రజల అభివద్ధికి ప్రణాళిక బద్ధంగా కషి చేస్తానని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఇది వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు ఇస్తున్న తీర్పు అని తెలిపారు, పశ్చిమలో కమలం విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు కొణిజేటి రమేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పతనం ఖాయమని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు రాష్ట్ర అభివద్ధిని చూస్తారని అన్నారు.



కొండపావులూరు-బిబిగూడెం రోడ్డు ధ్వంసం

• రైతులు, ప్రయాణీలకులకు తీవ్ర ఇబ్బందులు



గోతులు పడిన రోడ్డు

ప్రజాశక్తి గన్నవరం : మండలంలో కొండపావులూరు నుంచి బిబిగూడెం గ్రామాల్లోని పొలాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయ్యింది. ప్రయాణికులు, రైతులు కాలు మోపలేని పరిస్థితి తలెత్తింది. ద్విచక్ర వాహన చోదకులు ఆదమరిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. రాత్రిళ్ల ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. దాదాపు దశాబ్దం క్రితం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈరహదారి ని అభివద్ధి పరిచారు. ఐదేళ్లకు రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. ఆ తర్వాత ఐదేళ్ల పారెడు మట్టి కూడా వేయలేదు. వానలకు మొత్తం లేచిపోయి గోతులు మిగిలాయి. లారీలు, బస్సులు, ట్రాక్టర్ల తాకిడికి అవి రాళ్లతేలి పెద్దవిగా మారాయి. దీంతో ఈ రహ దారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

రైతుల బాధలు వర్ణాతీతం..

కొండపావులూరు, పురుషోత్తపట్నం నుంచి బిబిగూడెం వరకు పది కిలోమీటర్ల దూరం ఉంది. ర హదారికి ఇరువైపులా పంట పొలాలున్నాయి. దాదాపు రెండు వేల ఎకరాలలో వరి సాగు అవుత ంది. నిత్యం రైతులు పొలాలకు వెళ్తారు. రోడ్డంతా గోతులు పడటంతో నడవటానికి అగచాట్లు ప డుతున్నారు. ద్విచక్ర వాహనం పై వెళితే ఎక్కడ పడిపోతామో అన్న భయం వారిలో నెలకొంది. దీంతో చాలా మంది కష్టమైనా నడచి వెళు తున్నారు. ఈ రహదారికి మోక్షం లేదని మదన పడు తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లడానికి లారీలు రావటం లేదు. అందుకు కారణం రోడ్డం తా ధ్వంశం కావటమే. గత పదేళ్లలో ఈరహదారిని బాగు చేయించాలని కోరుతూ స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు నివేదించారు. అయి నా రహదారికి ఒక్క రూపాయి కూడా నిధులు మం జూరు కాలేదు. పురుషోత్తపట్నం, కొండపావులూరు, బిబిగూడెం రైతుల గోష ఎవరికీ వినపడటం లేదు. ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేయించాలని అంటున్నారు.



విలేకర్లు సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైసిపిపై చూపిన ఆదరణ మార్చిపోలేం

ప్రజాశక్తి - గుడివాడ : సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైసిపికి ఓట్లు వేసి కొడాలి నాని, వైయస్ జగన్‌మోహనరెడ్డిల గెలుపునకు సహకరించిన గుడివాడ నియోజకవర్గ ఓటర్లకు వైసిపి జిల్లా నాయకులు మండలి హనుమంతరావు, ఎంవి నారాయణరెడ్డిలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వైసిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో పోలీసులు వైసిపికి వ్యతిరేకంగా పనిచేసినా ధైర్యంతో ఓటర్లును ఓటు వినియోగించుకునేలా చేసిన ప్రతి వైసిపి కార్యకర్తకు, ప్రత్యేకంగా ఓటర్లుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు వెంపటి సైమన్, రేమల్లి నీలాకాంత(పసి), చూండూరి శేఖర్, తంగిరాల మోహన్‌దాసు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు కృతజ్ఞతలు : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం : అంగ, అర్థబలాలకు లోను కాకుండా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి అయిన తనకు ఓటు వేసిన నియోజక వర్గ ప్రజలకు, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమా నులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు గన్నవరం సిపిఎం అభ్య ర్థిగా పోటీ చేసిన కళ్ళం వెంకటేశ్వరరావు తెలిపారు. వివిధ రూపాల్లో నాకు ఓట్లు వేయించిన వారందరికీ పేరు పేరునా ధన్యవాదాలు అన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులకు, గాయకులకు నా కతజ్ఞతలు తెలిపారు.

ఘంటసాలలో తాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల గ్రామంలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు రోజుల నుంచి నీళ్ల పైపుల ద్వారా సరిగా రాకపోవడం తో ఘంట సాల గ్రామంలోని ఘోటకం -ఏ, బీ కాలనీలోని ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మంచినీటి అవస రాల కోసం ఓ ట్యాంకర్ తిరుగుతున్న ప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందకపో వడంతో ఘోటకం కాలనీ, క్రిస్టియన్ పేట వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఒక లైన్ కి వచ్చి ట్యాంకర్ ద్వారా నీళ్లు ఇచ్చేలోపు మరో వీధిలోని ప్రజలు ట్యాంకర్ వద్ద గుమ్మిగూడటంతో నీళ్లు సరిపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. సరైన బోర్ల సౌకర్యం కూడా లేకపోవడంతో నీటి కోసం ఘంటసాలపాలెంలోని కోళ్ల ఫారం వద్ద ఉన్న బోరు పంపులను ఆశ్రయించి నీళ్లను తెచ్చుకొని దాహార్తి తీర్చుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సిబిఎస్ఇ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సెయింట్ జాన్స ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్

సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక వి. యస్. సెయింట్ జాన్స్ 10, 12వ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే గాక, పదవ తరగతి విద్యార్థిని నిమ్మగడ్డ సాయి ఈషిత 487/500 మార్కులతో పాఠశాల మొదటి స్థానంలో నిలువగా , రెండవ స్థానంలో బి ప్రణీత్ 486/500, మూడవ స్థానంలో ఆర్. శ్రీనిధి 481/500 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లా డుతూ వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులు అత్యధికంగా ఇంగ్లీషు 98/100, తెలుగు 99/100, గణితం 99/100, సైన్సు 98/100, సోషల్ 98/100 మార్కులు సాధించారన్నారు. పరీక్షకు హాజరైన 10వ తరగతి విద్యార్థులు 205కాగా వారిలో 75 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించా రన్నారు. అదేవిధంగా ప్లస్ 2 విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రెవ.బ్రదర్ జిమ్మీ కురియోకోస్, రెవ.బ్రదర్. బి జోసఫ్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.



జాహ్నవి



వర్షిణి

విశ్వభారతి వైజ్‌వుడ్స్ విజయదుందుభి

ప్రజాశక్తి - గుడివాడ : సిబియస్ఇ విడుదల చేసిన పదవ తరగతి, 12వ తరగతి ఫలితాల్లో విశ్వభారతి వైజ్‌వుడ్స్ స్కూల్ అద్భుత ఫలితాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి ఫలితాలలో జి.వర్షిణి 500 మార్కులకు 487 సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 12వ తరగతి ఫలితాలలో ఏ.జాహ్నవి 500 మార్కులకు 475 సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇంతటి ఘనం విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు ఆర్. మంజుల, ఆర్. ప్రణీతలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థి ప్రతిభ



అపూర్వ

ప్రజాశక్తి-చల్లపల్లి : మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయంలో పదవ తరగతి చదివే చల్లపల్లికు చెందిన విద్యార్థి రేవళ్ల అపూర్వ సీబీఎస్ఈ సిలబస్ పదవ తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిల్చింది. కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించగా వారిలో చల్లపల్లి సాయి నగర్ కాలనీ కి చెందిన అపూర్వ 90 శాతం మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. అపూర్వ తల్లిదండ్రులు విజయ్,అరుణ లు సాయి నగర్ కాలనీ లో నివాసం ఉంటూ అదే పాఠశాలలో కంప్యూటర్, సోషల్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రేవళ్ల మాట్లాడుతూ ఎంపీసీ గ్రూపు ద్వారా ఇంటర్ చదివి తరువాత డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ ద్వారా ఇంగ్లీష్ ప్రత్యేక సబ్జెక్టుగా ఎంచుకొని ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా జీవితంలో స్థిరపడాలన్నది తన లక్ష్యమని అపూర్వ తెలిపింది.

కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి : సిబిఎస్ఇ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభకనపర్చారని కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 500 లోపు ర్యాంకులు మొత్తం 5 గురు విద్యార్థులు సాధించారని అన్నారు. మొదటి కౌన్సిలింగ్ లోనే వల్లూరిపల్లి శ్రీ రామ తేజ, జన్యావుల శ్రీ కష్ణ తేజస్, కొపనాతి శైలు, కోడె దొలా సాయి రామ్, చంద్రాల. వెంకట సుబ్రహ్మణ్యంలు ర్యాంకులు సాధించారన్నారు. వీరితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు సాధించారన్నారు. అదే విధంగా పాలిసెట్-2014లో చంద్రాల వెంకట సుబ్రహ్మణ్యం- స్టేట్ 327 వ ర్యాంక్ సాధించడంతో పాటు 20 మంది విద్యార్థులు కూడా సీటు సాధించారన్నారు. ఇంతటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఇంతటి ఘనవిజయానికి కషి చేసిన ఉపాధ్యాయిని. ఉపాధ్యాయులను కొమ్మారెడ్డి కిషోర్ అభినందించారు. అలాగే పాఠశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ, యంగ్ డైరెక్టర్ శ్రీ కొమ్మారెడ్డి చైతన్య పాఠశాల హెచ్ఎంఎన్. శ్రీనివాసరావులు విద్యార్థులను అభినందించారు.









సీల్ వేయకపోవడంపై అభ్యంతరం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి బికాలనీ పరిసర ప్రాంతంలో ఉన్న పోలింగ్ బూత్‌లో అర్ధ రాత్రి 12 గంటల వరకు హైడ్రామా కొనసాగింది. సాయంత్రం 6.30 గంటకు పోలింగ్ పూర్తి అయినప్పటికీ సదరు అధికారి 11.30 గంట వరకు ఈవీఎం మెయిన్ బాక్స్‌కు సీల్ వేయకపోవడంపై ఎన్నికల అధికారిని వైసిపి నేతలు నిలదీశారు. సెంట్ జేవీయర్ పాఠశాలలో కూడా ఎన్నికల నిబంధనలను అధికారులు తుంగలో తొక్కి వ్యవహరించారు. వైసీపీ అభ్యర్థి తిరుపతిరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో స్థానికంగా పని చేస్తున్న అధికారులను నియమించడంపై వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక సచివాలయ ఉద్యోగి, మున్సిపల్ ఎఇ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు.



మంగళగిరిలో 85.74 శాతం పోలింగ్

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గంలో 85.74% ఓట్లు పోలైనట్లుగా మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి మంగళవారం తెలిపారు. 2,92, 432 ఓట్లు గాను 2,50,742 ఓట్లు పోలైనట్లుగా తెలిపారు. అందులో పురుషులు 1,21,038 ఓట్లు, మహిళలు 1,29,697 ఓట్లు, ఇతరులు ఏడుగురు ఓటు హక్కు వినియోగించుకున్నట్లుగా తెలిపారు. సోమవారం రాత్రి 12 గంటల వరకు పోలింగ్ జరిగింది.

రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా అమర్లపూడి నియమాకం

ప్రజాశక్తి - మంగళగిరి



బుల్లా రాజారావు నుండి నియామక పత్రాన్ని అందుకుంటున్న అమర్లపూడి

మంగళగిరి అంబేద్కర్ సెంటర్లోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నూతనంగా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా విజయవాడకు చెందిన అమర్లపూడి ఎహేస్కేలు ను నియమిస్తూ ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు మంగళవారం ఎహేస్కేలు కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం బుల్లా మాట్లాడుతూ అమర్లపూడి ఎస్సీ ఎస్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు, న్యాయపరమైన సలహాలు అందించే విధంగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.



సరుకులు అందజేస్తున్న సత్యనారాయణ, విజయ్‌చందు

మాతృశ్రీ ఆశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేత

గుంటూరు: లయన్స్ 316-హెచ్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ జె.పి.వెంకటేశ్వర్లు మూడవ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టాభిపురంలోని రవీంద్రనగర్‌లోని మాతశ్రీ పిల్లల ఆశ్రమానికి 50 కేజీలు బియ్యం, కందిపప్పు, నూనె 15 రకాల మొత్తం నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జె.పి.వెంకటేశ్వర్లు బంధువులు సత్యనారాయణ, లయన్స్ మాజీ గవర్నర్ కె.విజయ్‌చందు తదితరులు పాల్గొన్నారు



ఘనంగా భగీరథ జయంతి వేడుకలు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి భగీరథ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ సగరుల మూలపురుషుడు భగీరథుడన్నారు. భగీరథుడు దివి నుంచి భూమికి గంగను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి శివ సత్యనారాయణ, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, గండికోట వీర రాఘవులు, అచ్చయ్య, దుంపల సోములు, రెడ్డి సుబ్బారావు, వీర రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి చైతన్యానికి మారుపేరని మరోమారు నిరూపితమైందని ఇండియావేదిక బలపరచిన సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు తెలిపారు. తెల్లవారకముందే నియోజకవర్గ ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఉత్సాహంగా ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లందరికి మంగళవారం ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఓటుహక్కు వినియోగించు కునేందుకు ఓపిగ్గా పోలింగ్ బూతుల్లో వేచిఉండటం వెల్లివిరిసిన ప్రజాచైతన్యానికి ప్రతీక అని అన్నారు. అహర్నిశలు కష్టపడి పని చేసిన సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. **ప్రజాశక్తి-తాడేపల్లి** :మంగళగిరి నియోజకవర్గంలో తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. గెలుపోటములు సహజమని చెప్పారు. ఆ విషయాన్ని పక్కన పెడితే గత 45 రోజుల నుంచి సిపిఎం గెలుపు కోసం వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి పోలింగ్ చివరి వరకు పని చేసిన కార్యకర్తలకు, అభిమానులకు అభినందనలు తెలిపారు. సిపిఎం రాజకీయ విధానాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో విజయం సాధించామని చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల వైఖరి, ఏ పార్టీ ఏ వర్గ ప్రయోజనాల కోసం పని చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగామని చెప్పారు. పోలీసింగ్ వ్యవస్థ సరిగ్గా పనిచేయకపోయనా నియోజకవర్గంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. ఎవరు గెలిచినా ప్రజల ప్రయోజనాల కోసం పని చేయాలన్నారు.

సంక్షేమం ఓటర్లను ప్రభావితం చేసింది

మీడియాతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి - తెనాలి



ఐదేళ్ల పాలనలో వైసిపి అందించిన సంక్షేమం ప్రజలను పూర్తిగా చైతన్యవంతం చేసిందని ఫలితంగానే ఓటర్ స్పందన అనూహ్యంగా ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక లెక్చరర్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ సారధ్యంలో ప్రజలు అన్ని విధాల లబ్ధి పొందాలని, తిరిగి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని మనసారా కోరుకుంటున్నారన్నారు. వెల్లువెత్తిన ఓటర్ల చైతన్యమే అందుకు నిదర్శనమన్నారు. వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పటికీ రాత్రి 10 గంటల వరకు బార్లు తీరి ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్క ఓటరుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తీర్పు స్పష్టంగా ఉంటుందని, తాను నియోజకవర్గంలో అందించిన సంక్షేమం ఎంతో పారదర్శకంగా ఉందన్నారు. ఎన్నికలకు రెండు నెలలు ముందు వచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చెల్లవన్నారు. పోలింగ్ రోజున తాను ఓటు వేసే క్రమంలో జరిగిన దాడి ప్రతిదాడిపై ఆయన స్పందిస్తూ, ఘటన వ్యూహాత్మకంగా, కుట్ర పూరితంగా జరిగిందని, ఘటన వెనుక దాగిన కుట్రను వెలికి తీస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు కూడా త్వరలోనే కుట్ర బాగోతం తెలుసుకుంటారన్నారు. ఘటనపై రకరకాలుగా స్పందించిన మనోహర్ ను కూడా క్యూలో ఉండే ఓటు వేశారా అంటూ ప్రశ్నించారు. సంక్షేమానికి ప్రజలు పట్టం కడతారని, జూన్ 4 తర్వాత అంతా స్పష్టమవుతుందన్నారు.

జనచైతన్య గ్రూప్స్ డైరెక్టర్ శకుంతల అస్తమయం

పలువురు ప్రముఖులు ఘననివాళి - స్తంభాలగరువు మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుంటూరు



మాదల శకుంతల (ఫైల్‌ఫోటో)

జనచైతన్య గ్రూపు సంస్థల డైరెక్టర్, వ్యవస్థాపకురాలు మాదల శకుంతల(86) సోమవారం గుంటూరులోని రాజేంద్ర నగర్‌లో ఆమె నివాసంలో మరణించారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు మాదల రత్నగిరి బాబు, మాదల సుధాకర్ ఉన్నారు. జనచైతన్య గ్రూపు సంస్థలను స్థాపించటం లోనూ, అభివృద్ధి చేయటంలో ఆమె ఎంతో కీలక భూమిక పోషించారు. శంకర కంటి ఆసుపత్రికి కోట్లాది రూపాయల విలువైన 5 ఎకరాల భూమిని కంచి కామకోటి ట్రస్టుకు విరాళంగా ఇచ్చారు. గుంటూరులో మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలను నిర్మించి నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీకి అప్పగించారు. సాయి భాస్కర్ ఆసుపత్రి నిర్మించారు. శ్రేష్టా ఇన్‌ఫ్రా, శకుంతల ఫైనాన్షియర్స్ సంస్థలను స్థాపిం చారు. కంచికామకోటి పీఠం నిర్వహిస్తున్న వేద కళాశాలకు ఐదు ఎకరాల స్థలం విరాళంగా ఇచ్చారు. మంగళవారం శకుంతల భౌతిక



స్తంభాలగరువు మహాప్రస్తానానికి తరలిస్తున్న శంకుంతల భౌతిక ఖాయం

ఖాయాన్ని టిడిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గుంటూరు పశ్చిమ టిడిపి అభ్యర్థి గల్లా మాదవి, ఎమ్మెల్యే ముస్తఫా, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పలువురు ప్రముఖులు పాల్గొని నివాళి అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రత్నగిరిబాబు మాట్లాడుతూ మా తల్లి ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచి పెద్దచేశారని, జనచైతన్య గ్రూపు సంస్థలను ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. జనచైతన్య గ్రూపు సంస్థల చైర్మన్ మాదల సుధాకర్ మాట్లాడుతూ ఆమె ఆదేశానుసారం అనేక సంస్థలకు ఆర్థిక సాయం అందించామని, భవిష్యత్‌లో ఆమె ఆశయాన్ని, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళతామన్నారు. అనంతరం స్థంబాల గరువులోని మహాప్రస్తానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సిపిని కలిసిన ట్రైనీ ఐపిఎస్‌లు



పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణకు జ్ఞాపికను అందిస్తున్న ట్రైనీ ఐపిఎస్‌లు.

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పిహెచ్‌డి రామకృష్ణను ట్రైనీ ఐపిఎస్ అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చేయవలసిన విధులపై వారం రోజులపాటు శిక్షణ కోసం 9 మంది ట్రైనీ ఐ.పి.ఎస్. అధికారులను ఎన్‌టిఆర్. జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించారు. ఈ నేపధ్యంలో ట్రైనీ ఐ.పి.ఎస్. అధికారులు ఈ నెల 8 తేదిన పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమీషనర్ పి.హెచ్.డి.రామకష్ణకు రిపోర్ట్ చేశారు.పోలీస్ కమిషనర్ సదరు ట్రైనీ ఐ.పి.ఎస్.అధికారులకు ఏ.ఆర్.ఏ.సి.పి. ప్రసాద్‌ను లైజనింగ్ అధికారిగా నియ మించి వారు చేయవలసిన శిక్షణ గురించి వివరించారు. ఈ నేపధ్యంలో వారికి ఎన్నికల నేపధ్యంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయు బందోబస్త్, ఎస్.ఎస్.టి., ఎఫ్.ఎస్.టి. బందాలు చేయు విధులపై, చెక్ పోస్ట్ లలో నిర్వహించు విధులపై, ఈ.వి.ఎం.లను బద్రపరచు కేంద్రాలు అయిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద ఏ విధంగా బందోబస్త్ ఏర్పాటు చేసుకోవాలి అనే విషయాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎలక్షన్ సందర్భంగా చేయు విధులపై ఎలక్షన్ అబ్సర్వర్ గారితో, పోలీస్ కమీషనర్ , కలెక్టర్‌తో ఎలక్షన్ బందోబస్త్ ఏర్పాట్లపై, ఏమైనా అనుకోని సంఘటనలు జరిగిన సమయంలో సమయస్ఫూర్తితో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలపై కూలంకుషంగా వివరించి, సమావేశాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు.ఈ నేపధ్యంలో వారం రోజుల ట్రైనింగ్‌ను ముగించుకుని వెళుతున్న సందర్భంగా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకష్ణను మర్యాపూర్వకంగా కలిసి ఆయనకు జ్ఞాపికను అందజేశారు.

21 నుండి ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక రామన్నపేట 1వ లైనులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో మే 21 నుండి పది రోజులపాటు ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్) కన్వీనర్ కె.సాయికుమార్ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తామన్నారు. పాఠశాల విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. ఇతర వివరాలు, పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 72075 66702, 63094 81514, 86888 97406 నంబర్లలో సంప్రదించాలని కోరారు. నిపుణులు ఉన్నత అధికారులు క్లాసులు తీసుకుంటారన్నారు.

ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్‌మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించినట్లు ఆర్టీసి గుంటూరు-2 డిపో మేనేజర్ యస్‌కె.అబ్దుల్ సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కూల్‌ల ఇప్పటి వరకూ 14బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వటం జరిగిందని, ప్రస్తుతం 15వ బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. కేవలం 16 సీట్లు మాత్రమే ఉంటాయని, కావున ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో ప్రతిరోజు ఒక గంట వాహనం యొక్క వివిధ భాగాలు, వాటి పనితీరు, వివిధ రకాల రోడ్లు, రోడ్లపైన ఉండే పెయింటింగ్ మార్కులు, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులు, రోడ్ల ప్రక్కన ఉండే సిగ్నల్ బోర్డుల గురించి సవివరంగా తెలియేస్తారని అన్నారు. అలాగే ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితో పదిహేను కిలోమీటర్లు బస్సును నడిపిస్తారని, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు చూయించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారన్నారు. గ్యారేజీలో సుదీర్ఘ అనుభవం ఉన్న మెకానిక్‌లు వాహనం విడిభాగాలు అన్ని చూపిస్తూ, వాటి పనితీరు గురించి తెలియజేస్తారన్నారు. ఘాట్‌రోడ్డులో ఎటువంటి భయం లేకుండా నడపటానికి కొండవీడు ఘాట్‌రోడ్డు, కోటప్పకొండ ఘాట్ రోడ్డులో స్వయంగా బస్సును నడిపిస్తార న్నారు. శిక్షణ పూర్తి అయ్యాక ఫారం-5, ఫారం 5ఎ సర్టిఫికెట్లు జారీ చేస్తామని, తద్వారా అభ్యర్థి ఆర్‌టిఎ నిర్వహించే టెస్ట్‌లో పాల్గొని లెసెన్స్ పొందవచ్చన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 8897371003, 7382894585 తెలియ జేయాలన్నారు.

రైతులకు సాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో సాగు, తాగునీటికి మరింత మేలు చేకూర్చేలా చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. రైతులకు కష్టాలు మిగిల్చింది. ముఖ్యంగా ఏలూరు పై చిన్నచూపు చూసింది. నియోజకవర్గంలో సాగుకు ఏలూరు కాల్వ కీలకమైన వనరు. నాలుగు మండలాల పరిధిలనూ వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తంగా రెండు జిల్లాల్లో 1.15 లక్షల ఎక రాలు, 82 గ్రామాలు సాగు, తాగునీటికి దీని పైనే ఆధారపడి ఉన్నాయి. కానీ ప్రభుత్వం కనీస నిర్వహణ చేపట్టలేదు. ఏటా ఖరీఫ్ కు ముందు గుర్రపు డెక్క తొలగించడం, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పూడిక తొలగించడం వంటి పనులేవీ చేయలేదు. రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. నాగార్జునసాగర్ కాల్వ ద్వారా నియోజ కవర్గానికి గతంలో అరకొరగానైనా నీళ్లు వచ్చేవి. ఏటా రబీ సీజన్లో నాలుగు నెలలు నీరందించాల్సి ఉండగా, ఆ సంగతే మర్చిపోయినట్లుగా వ్యవహరించారు. దీంతో మెట్ట గ్రామాల్లో పొలాలకు నీరందక చెరువులు నిండక దుర్భిక్ష పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

సాగర్ జలాలు ఏవి...

నియోజకవర్గంలో బాపులపాడు. గన్నవరం మండలాల్లోని మెట్ట ప్రాంతంలో చాలా గ్రామాలు నాగార్జునసాగర్ మూడో జోన్ పరిధిలో ఉన్నాయి. కాల్వల వ్యవస్థ ఉన్నా చిట్టచివరి కావడం, ప్రవాహం సక్ర మంగా లేకపోవడం అరకొరగానే నీళ్లందుతుండేవి. దీనిని మెరుగుప ర్చేందుకు ప్రపంచ బ్యాంకు నడులతో ఆధునికీకరణ పనులు చేప ట్టారు 2014-18 మధ్య కాలంలో బాపులపాడు మేజర్ నుంచి 9 కి.మీ వరకు ఒక విడ తగా, 9 కి.మీ నుంచి 19 కి మీ వరకు మరో



నీరు లేక ఎండుపోతున్న పంట (ఫైల్)

విడతగా కాల్వకు కాంక్రీట్ లైనింగ్, రాతి కట్టడాల స్థానే సిమెంట్ నిర్మాణాలు జరి పారు తద్వారా సాగర్ జలాలు సాఫీగా ప్రవహించడంతో పాటు, అనధికార గండ్లకు అడ్డుకట్ట పడి, భవిష్యత్తులో చింతలపూడి ఎత్తిపో తల ద్వారా వచ్చే గోదావరి జలాలు పరుగులు పెట్టేలా రూపకల్పన చేశారు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత సాగర్ జలాలు రావడమే గగనంగా మారిపోయాయి. బాపులపాడు, వేంపాడు మేజర్లు, కేసరపల్లి మైనర్ కాల్వల ఆయకట్టుకు ఒక్క ఏడాది కూడా పట్టుమని పది రోజులు నిర్విరా మంగా నీరు చేరలేదు. దీంతో పాటు అనుసంధాన కాల్వలను పట్టించుకో లేదు. ఈ ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా సాగు అవ సరాలకు సక్రమంగా నీరు చేరింది లేదు రైతులు ఆర్థికంగా నష్టపోయి ఇంజిన్లు, మోటార్ల సాయంతో పొలాలు తడుపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఏలూరు కాలంలో పూర్తిగా గుర్రపుడెక్కే పెరిగిపోయి నీటి ప్రవాహానికి ఇబ్బంది కలిగిస్తుంది. పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయకపోవడంతో ఆయిల్ ఇంజన్ పెట్టుకొని నీటిని పెట్టుకోవాల్సిన పరిస్థితి రైతులకు వచ్చింది. గుర్రపు డెక్కను తొలగించడానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. కూడిక తీయించే పనులు చేపట్టడం లేదు. ఈ కాలవ నుంచి దిగువ ప్రాంతాలకు నీటిని వదిలి చెరువులు నింపుకోవాల్సిన పరిస్థితి ఉంది. కానీ ప్రభుత్వ అలక్ష్యం వల్ల చెరువులకు నీరు అందడం లేదు.



కవుతరంలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం గ్రామంలో వైసీపీ, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామ టిడిపి పార్టీ నాయకుడు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం ఇంటిపై అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సింగవరపు సన్నీ సుబ్రహ్మణ్యం ఇంటిపైకి వైసిపి కార్యకర్తలతో దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీనితో ఇరు పార్టీల కార్యకర్తలు సుబ్రమణ్యం ఇంటి వద్దకు చేరుకోవడంతో వివాదం ఉధృతం అయింది. సమాచారం తెలుసుకున్న గుడివాడ రూరల్ సిఐ ఏసుబాబు, ఎస్సై సుబ్రహ్మణ్యం సంఘటన స్థలానికి చేరుకొని ఘర్షణను అడ్డుకొని పికిటింగ్ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల వారు తమ ఫిర్యాదులను పోలీసులకు అందించేందుకు సిద్ధమయ్యారు.

ఎపిపి సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 20 24 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకునే తేదీలను పొడిగించినట్లు పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. జాన్సన్ తెలిపారు. అభ్యర్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31వ తేదీ వరకు తమ దరఖాస్తులు సమర్పించుకోవచ్చునని తెలిపారు. 500 రూపాయల అపరాధ%శీ%తో జూన్ 7 వరకు, రూ .1000 అపరాధంతో జూన్ 14 వరకు తేదీలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. దేహదారుఢ్య పరీక్షలు జూన్ 25 నుంచి విశ్వవిద్యాలయంలోని క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీ సెట్ కు మారిన తేదీలను పీసెట్ వెబ్సైట్ నుంచి పొందవచ్చునని సూచించారు. అలాగే పి సెట్ దరఖాస్తులకు సంబంధించి ఏదైనా సందేహాలు ఉంటే 0863-2346218 నంబర్ ను సంప్రదించాలని జాన్సన్ తెలిపారు.

రైతులు, దళితుల కోసం పోరాడిన ఆమంచి నరసింహారావు

ప్రజాశక్తి - క్రోసూరు : ఆమంచి నరసింహారావు గొప్ప స్వాతంత్ర్య సమరయోధులుగానే కాకుండా రైతుల సమస్యలపైనా పోరాడారని, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికీ విశేషంగా కృషి చేశారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఆమంచి నరసింహారావు 26వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జి.రవిబాబు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రవిబాబు మాట్లాడుతూ 1916లో పుట్టిన నరసింహారావు స్వాతంత్ర్యానికి ముందే ఎన్‌జి రంగాతో కలిసి పోరాడారన్నారు. సత్తెనపల్లి తాలూకా ప్రాంతంలో పుల్లరి వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ చురుగ్గా పాల్గొన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, కార్యకర్తల గుర్తించి తీర్చిదిద్దడానికి కీలకంగా పని చేశారని చెప్పారు. ఊటుకూరు నుండి పుతుంబాక వెంకటపతిని గుర్తించి రాజకీయాల్లోకి తేవడానికి కృషి చేశారని అన్నారు. వేల్పూరు సర్పంచ్‌గా గ్రామంలో చెరువు పోరంబోకు భూమిని పట్టా భూమిగా మార్పు చేసి జెడ్‌పి పాఠశాల నిర్మాణానికి పాటుపడ్డారన్నారు. దళితులపై వివక్షతకు వ్యతిరేకంగా నిలబడ్డారని, దళితులకు డొంక రోడ్డు నిర్మించి వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత పాలకులు దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని, సామాన్యులపై ధరలు, పన్నుల భారం మోపుతున్నారని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఆమంచి నరసింహారావు స్ఫూర్తితో పోరాడదామని పిలుపునిచ్చారు. సభలో సిపిఎం అచ్చంపేట మండల కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు సిహెచ్ యేసయ్య, జి.చిన్నప్ప, కె.గోపిరెడ్డి, జి.మహేష్, పి.రాజు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో కెబిఎన్ విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వన్‌టౌన్ కొత్తపేటలో గల కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి పీ. భరత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల తొమ్మిదో తేదీన చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న భరత్‌కుమార్ తమ కళాశాల కీర్తిని, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసే రీతిలో తన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించినట్లు ఆయన తెఇపారు. చైనాలో జరిగిన పోటీల్లో పాల్గొని నగరానికి వచ్చిన భరత్‌కుమార్‌కు మంగళవారం రైల్వే స్టేషన్ వద్ద కళాశాల యాజమాన్యం, విద్యార్థులు భారీ సంఖ్యలో ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కళాశాల విద్యార్థులు భారీ ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాలకు వచ్చిన పీ భరత్‌కుమార్‌కు కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావులు సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ భరత్‌కుమార్ కళాశాల



విద్యార్థినికి స్వాగతం పలుకుతున్న కళాశాల సెక్రటరీ శ్రీనివాసు, ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు

కీర్తిని, రాష్ట్ర, దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటే విధంగా తన ప్రతిభను చాటాడన్నారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను, తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజలకు మంచినీరు అందించాలి

50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ పర్యటనలో భాగంగా గొల్లపాలెం గట్టు మహంతీపురం ప్రాంతాలలె 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంచినీటి సరఫరా తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంచినీటి ఇబ్బందులను సత్యబాబు అధికారుల దష్టికి తీసుకెళ్లారు. మంచినీరు రంగు మారి వస్తుందని, చీమల మందు వాసన వస్తుందని, కాలువలో వాటర్ పైపు లైన్లు మురుగునీరు వస్తుందని తెలిపారు. మరియు కొత్తగా వేసిన హెచ్.డి పైప్ లైన్లకు హౌస్ కనెక్షన్ మార్క్ చేయాలని కోరారు. దాసాంజనేయ వీధి ఇంటర్ కలెక్షన్లు పనులు పూర్తి చేయాలన్నారు. పాడైపోయిన పాత పైప్ లైన్లు తొలగించి కొత్త పైపులైన్ వేయాలని కోరారు. పాడైపోయిన బోరింగులు మార్పు చేయాలని సత్యబాబు డిమాండ్ చేశారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడిన ఓటర్లు : కర్లపాటి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఓటర్లు పెద్దఎత్తున ఓటు హక్కు వినియోగించుకుని రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడారని ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద ఎత్తున మహిళలు, సుదూర ప్రాంతాల నుంచి యువత ఈ ఎన్నికల్లో భాగస్వామ్యం వహించటం ప్రజా చైతన్యానికి నాంది అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిఘా వేదిక జిల్లా సమన్వయకర్తల ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్లు నిర్వహించిన పలు చైతన్య కార్యక్రమాల ఫలితమే అధిక శాతం ఓటింగ్ అన్నారు. అనేక చోట్ల ఈవీఎంల మొరాయింపు, ఆసౌకర్యాలు ఉన్నప్పటికీ ఓటర్లు విజ్ఞతతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

జెవివి సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక 2024 సభ్యత్వ నమోదు కార్యక్రమం జనవిజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ శాఖ గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శీతారామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు జి మురళీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జె వి వి సామాన్య ప్రజల్లో శాస్త్ర విజ్ఞానము శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడానికి కషి చేస్తుందన్నారు. మూడు విశ్వాసాలను చాందస భావాలను అరికట్టడానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. జెవివి సభ్యత్వ కార్యక్రమంలో మేధావులు ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జె వి వి అధ్యక్షులు వి మురళీమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు పి కామేశ్వరరావు, కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్కే సర్దార్ సాహెబ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఏపీఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ మంగళవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.







తూర్పులో 71.3 శాతం పోలింగ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విజయవాడ తూర్పు నియోజకవర్గంకు సంబంధించి ఎన్నికల పోలింగ్ 71,3 శాతం నమోదైందని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,70,624 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,32441 మంది పురుషులు, 1,38,160 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,93,031 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 94,399 మంది ఉండగా, 98,618 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఓటింగ్ శాతం తూర్పు నియోజకవర్గంలో గతంలో కన్నా అత్యధికంగా పోలవడంతో నియోజకవర్గంలో ఇరు పార్టీలకు సంబంధించిన నేతలు ఎవరికి వారే తమదే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఓటు శాతం పెరిగిందని ఒకరు, ప్రభుత్వం అనుసరిస్తున్న పథకాలు, అభివృద్ధి వల్ల అనుకూలంగా వచ్చిందని ఇంకొకరు ఎవరికి వారు గెలుపు తమదేనని గొప్పలు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా వైసిపి, టిడిపి చెందిన నేతలు తమ నాయకుడిదే గెలుపు అంటూ వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో సందేశాలను పంపుకుంటున్నారు. దీనితో పాటుగా తమ నాయకుడే గెలుస్తాడని పందేలు కూడా పెద్ద ఎత్తున కాసినట్లు తెలుస్తుంది.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ భద్రత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని నిమ్రా, నోవా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీ వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాట్లు చేశారు. ఏపీ లో పోలింగ్ పూర్తి అయిన నేపథ్యంలో



ఈవీఎంలు మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, నిమ్రా కాలేజ్ స్ట్రాంగ్ రూంలకు అధికారులు తరలించారు. ఈ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి సంపత్ కుమార్ పరిశీలించారు. తిరువూరు, నందిగామ, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను నోవా ఇంజనీరింగ్ కాలేజీకి తరలించారు.మైలవరం నియోజకవర్గం ఈవీఎంలను నిమ్రా మెడికల్ కాలేజీకి తరలిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి సంపత్ కుమార్ చెప్పారు. విజయవాడ ఈస్ట్, జగ్గయ్యపేట నియోజకవర్గం ఈవీఎంలను ఇంజనీరింగ్ కాలేజీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఏడు నియోజకవర్గ ఈవీఎంలను ఇబ్రహీంపట్నంలోని నిమ్రా, నోవా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలకు తరలిస్తున్నామని రిటర్నింగ్ అధికారి సంపత్ కుమార్ చెప్పారు.

స్పీడ్ బ్రేకర్లపై మార్కింగ్ వేయరూ...

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురంలోని ప్రధాన రహదారి అయిన చర్చి సెంటర్ నుండి స్వాతి సెంటర్‌కు వెళ్లు మార్గంలో డివైడర్‌కు రెండు వైపులా ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేశారు. బాగానే ఉంది. వాహనదారులు అతి వేగంగా వెళ్ళకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రమాదాలు జరక్కుండా ఉండే ఉద్దేశ్యంతో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు వేసిన అధికారులు ఆ స్పీడ్ బ్రేకర్లపై జీబ్రా గీతలు లేకుండా వదిలేశారు. దీంతో రోడ్డుతో సమానంగా ఉన్నట్లు కనిపించటంతో, అటుగా ప్రయాణించే ఆటోవాలాలు, కార్లు, ద్విచక్ర వాహనదారులకు దగ్గరకు వెళ్లే దాకా ఆ స్పీడ్ బ్రేకర్లు కనబడక షడన్ బ్రేక్ వేయాల్సి రావటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. స్పీడ్ బ్రేకర్లు వేసినప్పుడు కొద్దిగా దూరం నుంచే స్పీడ్ బ్రేకర్ ఉందని తెలియాలంటే వాటిపై పసుపు రంగు, తెల్లరంగుతో (జీబ్రా) గీతలు గీస్తారు. మరి ఎందుకు వేయలేదని వాహనదారులు



మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీబ్రా గీతలు గీయకుండా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లపై కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.